క్లుప్తంగా

పశువైద్య శిబిరం

రాజుపాళెం : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కొర్రపాడు పశువైద్యాధికారిణి టి.లక్ష్మీదేవి తెలిపారు. మండలంలోని కొర్రపాడు గ్రామంలోని పశువైద్యశాలలో గోపవరంలోని పశువైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన పాడి పశువులకు గర్భకోశ, సాధారణ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్సలు అందించారు. పశువులకు అవసరమైన వివిధ రకాల మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, గర్భకోశ శస్త్ర విభాగాధిపతి డాక్టర్ జ్యోతి, మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సుధాకర్‌రెడ్డి, బోధన పశువైద్య విభాగాధిపతి డాక్టర్ రాంబాబు, పరాన్న జీవ శాస్త్ర ఆచార్యులు డాక్టర్ జ్ఞానిచరిత, నిర్ధారణ విభాగం ఆచార్యులు డాక్టర్ భాస్కర్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్లు కళ్యాణి, ప్రశాంత్, సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఫ్లెక్స్ ప్రింటింగ్ షాపులు బంద్

ప్రొద్దుటూరు : ఏపీ ఫ్లెక్స్ ప్రింటర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు ఫ్లెక్స్ ప్రింటింగ్ షాపులను రాష్ట్ర వ్యాప్తంగా బంద్ చేయనున్నట్లు అసోసియేషన్ నాయకుడు సృజన శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఫ్లెక్స్ ప్రింటింగ్‌లను బ్యాన్ చేయడంతో ఫ్లెక్స్ ప్రింటింగ్ షాపులపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది తీవ్రంగా నష్టపోతారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తమకు ప్రత్యామ్నాయం చూపకుండా ఫ్లెక్స్ ప్రింటింగ్‌ను నిషేధించడం అన్యాయమని తెలిపారు.

వీల్‌చైర్ వితరణ



చౌడయ్యకు వీల్ చైర్ అందిస్తున్న కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీకి చెందిన దివ్యాంగుడు చౌడయ్యకు శనివారం కొనిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్, పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి రూ.15వేలు విలువ చేసే వీల్ చైర్ అందించారు. ఈ సందర్భంగా కొనిరెడ్డి శివచంద్రారెడ్డికి చౌడయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహులు, సాబీర్, ముక్తార్, నాయుడు, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరుబాట పోస్టర్ల ఆవిష్కరణ

ప్రొద్దుటూరు : మండలంలోని పెన్నానగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంలో శనివారం పోరుబాట పోస్టర్లను సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటి నిర్మాణాలు భారమయ్యాయని తెలిపారు. రూ.లక్షా 80వేలతో పునాదులు కూడా లేవవన్నారు. ప్రతి ఇంటికి రూ.5 లక్షలు లబ్ధిదారులకు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివారెడ్డి, హరి, షరీఫ్, ఏఐటీయూసీ నాయకులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

రేపు వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

కలసపాడు : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో సోమవారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎం.నాగరాజ తెలిపారు. ఉదయం 5 గంటలకు అమ్మవారి నగర సంకీర్తన, 10 గంటలకు గణపతిపూజ, నగరేశ్వరస్వామికి, అమ్మవారికి అభిషేకాలు ఉంటాయన్నారు. సాయంత్రం 6 గంటల నుండి సామూహిక లక్ష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, భజనలు, గుడి ఉత్సవం, మహా మంగళహారతి, పవళింపు సేవ తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామికి పుష్యమాసం ఆరంభం 5వ శనివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక అభిషేకంతో పాటు పూజా కార్యక్రమాలు, శాంతి హోమం నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



రాజుపాళెం : వెంగళాయపల్లెలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

రాజుపాళెం : పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని వెంగళాయపల్లె గ్రామంలో శనివారం సాయంత్రం సర్పంచ్ ధనిరెడ్డి రేణుకమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అంకిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించి, పథకాల ద్వారా లబ్ధి పొందిన వివరాల సంక్షేమ బావుట బుక్‌లెట్‌ను అందించారు. అనంతరం ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అయ్యవారిపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రవీంద్ర ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు జీరెడ్డి అంజనీకుమారి, పార్టీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి, సచివాలయాల కన్వీనర్ నాగశేషారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, ప్రజా ప్రతినిధులు, ఆయా గ్రామాల్లోని నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి వైఎస్ జగన్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ



టైలర్స్‌కాలనీలో బుక్‌లెట్ అందజేస్తున్న బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, తదితరులు

బద్వేలు : రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. శనివారం పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ సచివాలయం-1 పరిధి మహబూబ్‌నగర్, టైలర్స్‌కాలనీ, తోలుబొమ్మలాట వీధి ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన వివరాలను ఇంటింటి వద్దకు తిరిగి లబ్ధిదారులకు తెలియజేశారు. సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు అప్పటికప్పుడే సూచనలందించారు. పంచాయతీలో ముగింపు సందర్భంగా పార్కులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. దాదాపు 4 వేల గృహాలకు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించామని పేర్కొంటూ ఎమ్మెల్యేకు సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి సన్మానం చేశారు. సచివాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపి బహుమతులు అందించారు., కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీ బాషా, రాజశేఖర్, ఎంపీటీసీలు రమణ, మహబూబ్‌పీరా, చంద్రాయుడు, ఉప సర్పంచ్ రుద్రవరం ప్రసాద్, నాయకులు డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, చిత్తా గిరిప్రణీత్ రెడ్డి, మాల కొండయ్య, చాపాటి సాయి నారాయణ రెడ్డి, ఎంపీడీఓ నూర్జహన్, ఈఓపీఆర్డీ బాస్కర్‌బాబు, ఈఓ సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

బైక్ ర్యాలీలో పాల్గొన్న ఆర్టీఓ సుశీల



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఆర్టీఓ సుశీల

ప్రొద్దుటూరు క్రైం : హెల్మెట్ లేకుండా బైక్ నడపడం ప్రమాదకరమని ఆర్టీఓ సుశీల తెలిపారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎర్రగుంట్ల రోడ్డు సర్కిల్ నుంచి రాజీవ్ సర్కిల్ వరకు శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ సర్కిల్లో ఆర్టీఓ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా, అతి వేగంగా వాహనాలను నడపడం వల్లనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వేగంగా వెళ్లినా, సాధారణ స్పీడ్‌తో వెళ్లినా 5-10 నిమిషాల వ్యత్యాసంతో గమ్యస్థానానికి చేరుకుంటామని చెప్పారు. తప్పకుండా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐ నారాయణనాయక్, ఏఎంవీఐ శ్రీనివాసరెడ్డి, బైక్ షోరూంల డీలర్లు, వారి సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్యారేజ్‌లో..

స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ సుశీల మాట్లాడుతూ రహదారి నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు జరగవని చెప్పారు. ప్రధాన రహదారి పక్కన వాహనాలను పార్కింగ్ చేయరాదన్నారు. నిర్దేశించిన ప్రదేశాల్లోనే పార్కింగ్ చేయాలని సూచించారు. రోడ్డు పక్కన నిలిపే వాహనాల వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి, డాక్టర్ సురేష్‌బాబు, టూ టౌన్ ఎస్ఐ రెడ్డిసురేష్, ఎంవీఐలు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణకు స్తూపం ఏర్పాటు



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలోని శివాలయం సర్కిల్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26న వంద అడుగుల ఎత్తులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా శాశ్వతంగా రూ.15 లక్షల వ్యయంతో స్తూపం ఏర్పాటు చేసి జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు. ఇంత వరకు మున్సిపాలిటీ చరిత్రలో ఎవరూ ఇలాంటి ఆలోచన చేయలేదు. ప్రజల్లో జాతీయ భావాన్ని నింపేందుకు ప్రత్యేకంగా ఈ నిర్మాణం చేపడుతున్నారు. కొద్ది రోజులుగా జరుగుతున్న నిర్మాణ పనులను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పరిశీలించారు. శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఈ పనులను పర్యవేక్షించారు.

నేడు 7వేల మంది కార్యకర్తలతో సభ

అనిబిసెంట్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి 7వేల మంది కార్యకర్తలు, పార్టీ శ్రేణులతో ఆదివారం ఉదయం సమావేశం నిర్వహించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నిర్ణయించారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఇందు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలోని 82 వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో కన్వీనర్లు, క్లస్టర్ల పరిధిలో గృహ సారథులను నియమించారు. నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కన్వీనర్లు, గృహ సారథులతోపాటు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, ఇతర పార్టీ పదవులు ఉన్న వారు, క్రియాశీలక కార్యకర్తలు కలిపి సుమారు 7వేల మందితో సభ నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి 1 గంట వరకు సభ జరుగనుంది.

సభకు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి హాజరు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఘన విజయం సాధించేందుకు పార్టీ శ్రేణుల్లో దిశ, నిర్దేశం చేసేందుకు ఈ సభను ఏర్పాటు చేశారు.

సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

సభ ఏర్పాట్లను శనివారం రాత్రి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమావేశం

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులోని ఎస్.కె.జూనియర్ కళాశాలలో ఆదివారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన 1997-98వ బ్యాచ్ విద్యార్థుల సమావేశం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు డి.పోతులూరయ్య, ఆంజనేయులు, చంద్రశేఖర్, దిలీప్‌లు తెలిపారు. ఈ సమావేశానికి అప్పటి గురువులు హాజరవుతున్నారని, సమావేశం అనంతరం వారికి సన్మాన కార్యక్రమం ఉంటుందని, ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

23న ప్రతిభా పరీక్ష

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణాలయం ఫంక్షన్ హాల్‌లో ఈనెల 23న ఉదయం 9 గంటలకు నేతాజీ సోషియల్ క్లబ్ ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్రంలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభాపరీక్ష నిర్వహించనున్నట్లు క్లబ్ కన్వీనర్ డి.భాస్కర్‌రావు తెలిపారు. శనివారం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగానే ఈ ఏడాది కూడా జిల్లాలోని 36 మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలో తెలుగు, ఇంగ్లిష మీడియాల్లో ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ప్రథమ బహుమతి రూ.3 వేలు, ద్వితీయ బహుమతి రూ.2 వేలు, తృతీయ బహుమతి రూ.1000లతోపాటు 10 కన్సోలేషన్ బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డి.నాగరాజారావు, ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు, కోశాధికారి కృష్ణమోహన్‌రావు, కార్యదర్శి షహబుద్దీన్, పద్మనాభరాజు, గురుకుమార్, మధుమతి, బాబాసాహెబ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చేతిరాత పోటీలు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జిల్లా స్థాయి చేతిరాత పోటీలు నిర్వహించినట్లు అక్షర హ్యాండ్ రైటింగ్ డైరెక్టర్ మల్లేశ్వరరెడ్డి తెలిపారు. పోరుమామిళ్ల, నరసాపురంలలో శనివారం నిర్వహించిన పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 860 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు.

పెండింగ్ బిల్లుల మంజూరుకు చర్యలు

మండల అధ్యక్షులు లక్షుమయ్య



మండల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీపీ లక్షుమయ్య

చాపాడు : మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లుల మంజూరు కోసం ప్రభుత్వ అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుపై మండల అధికారులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం, గ్రామ సచివాలయ నిధులతో పాటు ఇతర నిధుల కింద మండలంలో జరుగుతున్న పనులు నాణ్యతగా జరిగేలా దృష్టి పెట్టాలన్నారు. ఇదే క్రమంలో కాంట్రాక్టర్లకు చేసిన పనులకు త్వరగా బిల్లులు మంజూరయ్యేలా ఎంబుక్‌లను సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, మండల ఇంజనీర్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టాకు వివరాలను తెలియపరచాలి



ఎరువుల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న ఏడీఏ నాగరాజు

గోపవరం : ఎరువులు, పురుగు మందుల స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారికి తెలియపరచాలని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు తెలిపారు. శనివారం సాయంత్రం మండల పరిధిలోని తుమ్మలపెంట నరసింహులు ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులు, బిల్లులు, ఎస్‌వాయిస్‌లు పరిశీలించారు. నిర్ణయించిన ధరలకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను రైతులకు విక్రయించాలని తెలిపారు. లైసెన్సు, స్టాకు వివరాలు, ధరలు తెలియజేసే బోర్డును అందుబాటులో ఉంచాలన్నారు. చట్టప్రకారం ఎరువులు, పురుగు మందులు కొనుగోలు, అమ్మకాలు చేపట్టాలన్నారు. నిబంధనలు పాటించని డీలర్లపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మార్పీ కన్నా ఒక్క రూపాయి అధికంగా అమ్మినా లైసెన్సులు రద్దు చేస్తామని తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



దిశ డీఎస్పీని సన్మానిస్తున్న సీఐ, కళాశాల అధ్యాపక బృందం

బద్వేలు అర్బన్ : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని దిశ పోలీసుస్టేషన్ డీఎస్పీ ఆర్.వాసుదేవన్ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో శనివారం విద్యార్థులకు ఈవ్ టీజింగ్, సైబర్‌క్రైమ్, దిశ యాప్ వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన దిశ యాప్ వారికి అండగా ఉంటుందన్నారు. అలాగే సైబర్‌క్రైమ్ నేరస్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు, దిశ ఎస్ఐ లక్ష్మీదేవి, మహిళా కానిస్టేబుల్ షామిలి, దిశ కోఆర్డినేటర్లు నాగజ్యోతి, పుష్పలత, అర్బన్ ఎస్ఐలు వెంకటరమణ, శ్రీకాంత్, మహిళా సంరక్షణ కార్యదర్శులు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలసదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా అక్కాయపల్లెలోని బాలసదన్‌లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు అందుతున్న సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. వారు ఉంటున్న గదులను పరిశీలించారు. బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 గురించి వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలసదన్ సూపరింటెండెంట్ వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎంవీఐ శేఖర్‌రావు

బద్వేలు అర్బన్ : స్కూల్ బస్సు డ్రైవర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని బద్వేలు రూరల్ సీఐ హనుమంతనాయక్, బద్వేలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఎంవీఐ కార్యాలయ ఆవరణలో స్కూల్ బస్సుల డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి స్కూల్ బస్సుకు తప్పనిసరిగా సహాయకుడు ఉండాలని తెలిపారు. అలాగే స్కూల్ బస్సుల డ్రైవర్లు లైసెన్స్ పొంది 5 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఫైర్ సిబ్బందితో అగ్నిప్రమాద నిరోధక యంత్రాలు ఎలా ఉపయోగించాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల స్కూల్ బస్సు డ్రైవర్లు, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలలో టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

కడప రూరల్ : జిల్లా గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి హెచ్ వెంకటసుబ్బయ్య తెలిపారు. దరఖాస్తు నమూనా ఫారాలు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో లభిస్తాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను అభ్యర్థులు స్వయంగా ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఏపీ టీడబ్ల్యూఎస్(ఆర్) రాయచోటి పాఠశాలలో సమర్పించాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన ఉదయం 10 గంటలకు రాయచోటి పాఠశాలలోనే నిర్వహించే డెమో, ఇంటర్వ్యూకు అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 7382264994ను సంప్రదించాలన్నారు.

నేడు పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష




సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

- ప్రొద్దుటూరులో 23 సెంటర్ల ఏర్పాటు
- పరీక్ష రాయనున్న 12,347 మంది అభ్యర్థులు
- 430 మంది పోలీసులతో బందోబస్తు

ప్రొద్దుటూరు క్రైం : ఆదివారం నిర్వహించనున్న పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలకు పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రొద్దుటూరులో 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సుమారు 12,347 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం ఏఎస్పీ ప్రేరణాకుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎస్పీతో పాటు ముగ్గురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 25 మంది ఎస్ఐలు, 400 మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొననున్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒక ఎస్ఐతో పాటు 10 మంది సిబ్బందిని నియమించారు. అలాగే రెండు కేంద్రాలకు ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా సీఐ బందోబస్తును పర్యవేక్షిస్తారు. ఇతర ప్రాంతాల నుంచి అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో పోలీసు సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ కొత్త బస్టాండు, రాజీవ్‌సర్కిల్, రైల్వేస్టేషన్‌ల వద్ద ఆదివారం ఉదయం నుంచి సహాయక కేంద్రాలు పని చేస్తాయి. ప్రొద్దుటూరులో జరిగే కానిస్టేబుల్ రాత పరీక్షల పరిశీలన అధికారిగా ఎస్పీ చక్రవర్తిని ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించింది. పరీక్షలు నిర్వహించు కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు.

నాటకాభివృద్ధికి వైవీయూ కృషి అభినందనీయం

ప్రసిద్ధ నాటకకర్త పల్లేటి కులశేఖర్



నాటకకర్త పల్లేటి లక్ష్మీకర్‌ను సన్మానిస్తున్న లలితకళల విభాగం అధ్యాపకులు, విద్యార్థులు

వైవీయూ : కాలంలో తెరమరుగవబోతున్న నాటకాన్ని అభివృద్ధి చేయడానికి వైవీయూ లలితకళల విభాగం, రంగస్థల కళల అధ్యాపకులు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రసిద్ధ నాటకకర్త పల్లేటి లక్ష్మీకులశేఖర్ పేర్కొన్నారు. ఇటీవల ప్రతిష్ఠాత్మక అప్పాజోస్యుల-విష్ణుభొట్ల-కందాళం ఫౌండేషన్ వారి విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారం పొందిన పల్లేటి లక్ష్మీ కులశేఖర్ శనివారం వైవీయూను సందర్శించారు. ఈ సందర్భంగా లలితకళల విభాగం ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పల్లేటి లక్ష్మీకులశేఖర్ మాట్లాడుతూ సాహిత్య ప్రక్రియలన్నింటిలో నాటకం గొప్పదని, ప్రజా హృదయాలను అలరించి, స్పందింపజేసే లక్షణం, ప్రజల కష్టసుఖాలను, ప్రత్యక్షంగా చూపగలిగే సత్తా ఒక్క నాటకానికే ఉందన్నారు. 'రాయలసీమ నాటకం చరిత్ర అధ్యయనం' అన్న అంశంపై ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అధ్యయనం చేసి సీమ నుంచి వందలాది గొప్ప నాటకాలు వచ్చాయని నిరూపించారని పేర్కొన్నారు. లలితకళల విభాగం ఆచార్యులు డా. మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రంగస్థల కళల కోర్సు రాయలసీమలో కేవలం వైవీయూలో మాత్రమే ఉందని, కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.